# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

# ప్రాంతీయ వార్తా విభాగం

# ప్రాంతీయ వార్తలు

తేది : 27 -01-2026 సమయం : 1.20 గంటలు

## ముఖ్యాంశాలు

1. **భారతదేశ కార్మిక రంగంలో కొత్త కార్మిక కోట్లు కీలకమైన సంస్కరణలుగా నిలుస్తాయని కేంద్రమంత్రి శోభా కరంద్లాజే అన్నారు.**
2. **టిడిపి పార్టీ కార్యాలయంలో ఈరోజు జరిగే శిక్షణ తరగతుల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్లమెంటరీ కమిటీలకు దిశానిర్దేశం చేస్తారు.**
3. **రాజధాని రైతులకు ఈనెల 29వ తేదీన మలివిడత ప్లాట్లను కేటాయిస్తామని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు.**
4. **రాష్ట్రంలో ఇప్పటివరకు 42 లక్షల 73 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.**

-----------------------

భారతదేశ కార్మిక రంగంలో  కొత్త కార్మిక కోడ్‌లు  కీలకమైన సంస్కరణలుగా నిలుస్తాయని కేంద్ర  కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే

అన్నారు. విజయవాడలో జరుగుతున్న 3వ కార్మిక ఉపాధి శాఖ ప్రాంతీయ సదస్సులో కేంద్ర మంత్రి ఈ రోజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మిక సంస్కరణలతో, ప్రభుత్వం దేశంలోని అన్ని రంగాలలో కార్మిక రంగాన్ని బలోపేతం చేసిందన్నారు. కొత్త లేబర్ కోడ్స్ పై అపోహలు తొలిగించటానికి వివిధ రాష్ట్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహిన్నామని చెప్పారు. కొత్త కార్మిక చట్టాలు ఉద్యోగులకు, కార్మికులకు మేలు చేస్తాయని, సామాజిక భద్రతను పెంచుతాయని కేంద్రమంత్రి తెలుపుతూ,

వాయిస్ .. 30 సెకన్లు

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, గోవా, జైపూర్‌లో నిర్వహించిన ప్రాంతీయ సదస్సుల కొనసాగింపుగా ఈ సదస్సు విజయవాడలో జరగడం సంతోషకరమని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత పాలన ద్వారా పారదర్శకత, వేగవంతమైన సేవలు సాధ్యమవుతాయన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, ఉపాధి అవకాశాల పెంపు, పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పించడమే కొత్త లేబర్ కోడ్‌ల ప్రధాన లక్ష్యమని వివరించారు.

-----------------------

గుంటూరు జిల్లా మంగళగిరిలో తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో పార్లమెంటరీ కమిటీలకు శిక్షణ తరగతులు ఈ రోజు నుంచి ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, పార్లమెంట్

సభ్యులు, శాసన సభ్యులు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు పాల్గొన్నారు. మధ్యాహ్నం నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ లక్ష్యాలు, తాజా రాజకీయ పరిణామాలపై పార్లమెంటరీ కమిటీలకు, శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ముగింపు సమావేశంలో కమిటీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేయనున్నారని టిడిపి పార్టీ నాయకులు తెలిపారు.

----------------------

రాజధాని రైతులకు ఈనెల 29వ తేదీన మలివిడత ప్లాట్లను కేటాయిస్తామని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. అమరావతిలో మంత్రి ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, సీడ్ యాక్సిస్ రోడ్డు కోసం భూములిచ్చిన రైతులకు ప్లాట్లను కేటాయిస్తున్నామని చెప్పారు. అమరావతిలోని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ - సీఆర్డీఏ కార్యాలయంలో ఈ-లాటరీ ద్వారా ప్లాట్ల కేటాయింపు ప్రక్రియను అధికారులు నిర్వహిస్తారని తెలిపారు. ఈ-లాటరీ పద్ధతిలో పారదర్శకంగా జరిగేందుకు ప్రత్యేక ఏర్పాట్లను చేశామని మంత్రి పేర్కొన్నారు.

----------------------

గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రం నుంచి కళల విభాగంలో పద్మశ్రీ పురస్కారానికి ప్రముఖ తెలుగు చలన చిత్ర నటులు, మాజీ పార్లమెంట్ సభ్యులు మాగంటి మురళీమోహన్ ను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. దీనిపై మురళీమోహన్ స్పందిస్తూ.. కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో గౌరవించడం సంతోషంగా ఉందని చెప్పారు. పద్మ అవార్డుకు ఎంపిక

చేయడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ,

వాయిస్..30 సెకన్లు

-----------------------

దేశానికి కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అభివృద్ధిలో జాప్యానికి కారణమయ్యే సమస్యలను పరిష్కరించడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న Pro-Active Governance and Timely Implementation- ప్రగతి సమావేశాలు దోహదపడ్డాయి. ఇందులో జల శక్తి మంత్రిత్వశాఖకు సంబంధించిన పలు ప్రాజెక్టులు ఉన్నాయి. ప్రస్తుతం జల శక్తి మంత్రిత్వ శాఖకు చెందిన 66 సాగునీటి ప్రాజెక్టుల్లో 43వేల 583 కోట్ల రూపాయల విలువైన 10 ప్రాధాన్యత ప్రాజెక్టులను ప్రగతి యంత్రాంగం ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేరుగా సమీక్షించారు. ఈ 66 సాగునీటి ప్రాజెక్టుల్లో ప్రగతి సమీక్షల ద్వారా 26 ప్రాజెక్టులు పూర్తవ్వగా 40 ప్రాజెక్టులు అమలు దశలో ఉన్నాయి. పూర్తైన ప్రాజెక్టులు ఇప్పటికే లక్షలాది ఎకరాలకు సాగునీరు అందిస్తూ, వ్యవసాయ రంగంలో మరింత విప్లవాత్మక మార్పులు తెచ్చాయి.

-----------------------

వారానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలని కోరుతూ బ్యాంకు యూనియన్ల ఐక్యవేదిక -యూఎఫ్‌బీయూ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు ఈరోజు సమ్మెలో పాల్గొంటున్నారు. వారి సమస్యలపై

ఉన్నతాధికారులతో  ఈ నెల 23వ తేదీన జరిపిన చర్చలు సఫలం కాకపోవడంతో బ్యాంకు అధికారులు, సిబ్బందికి ప్రాతినిధ్యం వహిస్తున్న తొమ్మిది సంఘాల ఉమ్మడి వేదిక.. యూఎఫ్‌బీయూ సమ్మెకు పిలుపునిచ్చింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల సమ్మెతో బ్యాంకు కార్యకలాపాలు నిలిచిపోయాయి.

-----------------------

రాష్ట్రంలో ఇప్పటివరకు  42 లక్షల 73 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం  కొనుగోలు చేశామని  పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. గుంటూరు జిల్లా తెనాలి మండలంలోని కంచర్లపాలెం గ్రామంలో  నిర్వహించిన రైతుల ఆత్మీయ సమావేశంలో మంత్రి నిన్న  పాల్గొన్నారు.  ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ,  ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలులో 50 లక్షల టన్నుల లక్ష్యానికి  దగ్గరగా ఉన్నామని తెలిపారు.  తుఫాన్లు, అకాల వర్షాలకు పంట నష్టపోయిన  రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు.

-----------------------

విశాఖపట్నం  వేదికగా భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరగనున్న నాలుగవ టీ20 క్రికెట్ మ్యాచ్ కోసం ఇరు జట్ల క్రీడాకారులు  ఈ రోజు విశాఖపట్నం చేరుకున్నారు. గువాహటి నుంచి ప్రత్యేక విమానాల్లో విశాఖ చేరుకున్న  క్రీడా కారులకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధికారులు  స్వాగతం పలికారు. ఐదు మ్యాచ్ ల సిరీస్ లో  ఇప్పటికే భారత్ 3-0 తో ఆధిక్యంలో ఉంది.  భారత్ , న్యూజిలాండ్ జట్ల మధ్య  రేపు రాత్రి 7 గంటలకు నాలుగో టీ20 మ్యాచ్ జరగనుంది.

-----------------------

రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. భక్తుల కోసం అన్ని సౌకర్యాలతో రూపొందించిన కారవాన్ వాహనాన్ని సెల్లూరులో ఆయన నిన్న ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, కారవాన్‌లో పుణ్యక్షేత్రాలను సందర్శించే కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటకశాఖ శ్రీకారం చుట్టడం సంతోషకరమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ వాహనాలను ప్రారంభించి ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించేందుకు భక్తులకు అందుబాటులో ఉంచనున్నట్లు మంత్రి వెల్లడించారు.

----------------------

తిరుపతి జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రం శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 10వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బాపిరెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాల గోడపత్రికలను స్థానిక శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి, ఆలయ పాలకమండలి సభ్యులతో కలిసి ఆయన ఈ రోజు ఆవిష్కరించారు. అనంతరం బాపిరెడ్డి మాట్లాడుతూ, ఫిబ్రవరి 10వ తేదీన భక్తకన్నప్ప ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమై 20వ తేదీ ధ్వజావరోహణంతో ముగుస్తుందన్నారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

=======================